

మండుతున్న ఎండలు

దుద్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే ఎండలు భగ్గుమంటున్నాయి. గత ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. శివరాత్రి కూడా రాలేదు ఉదయం 10 గంటలకే సూర్యుడు సెగ పుట్టిస్తున్నాడు. ఫిబ్రవరి మొదటి వారంలోనే పగటి ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలు దాటుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులుకు గురవుతున్నారు. గత ఏడాది ఇదే సమయంలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఈ సారి అందుకు భిన్నంగా పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పుడే ఉష్ణోగ్రతలు ఇలా ఉంటే మున్ముందు ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

- కేసీఆర్, కేటీఆర్ దత్తత పేరుతో మోసం
- కొడంగల్ అభివృద్ధిని చూసి ఓర్వలేక కుట్ర
- రూ.6,128 కోట్లతో కొనసాగుతున్న పనులు
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మహబూబ్‌నగర్‌ను దత్తత తీసుకొని, కేటీఆర్ కొడంగల్ దత్తత తీసుకొని చేసిందేమి లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలు, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో పది సంవత్సరాలు గడిచినా అభివృద్ధి చేయలేదన్నారు. ప్రాణహిత చేవేళ్ల పథకం, వికారాబాద్, కృష్ణా రైల్వే లైన్ పనులను వారి ప్రాంతానికి తరలించి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారన్నారు. అన్నీ రంగాల్లో వెనకబడిన కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడం ఈ ప్రాంతవాసుల అదృష్టమన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, వైద్యం, తాగు, సాగు నీటికి ప్రాధాన్యత కల్పిస్తూ ఇప్పటికే ఈ ప్రాంత అభివృద్ధికి రూ.6,128 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు.

బీఆర్‌ఎస్ రైతు దీక్షను బహిష్కరించాలి

దేశ చరిత్రలో చారిత్రాత్మకంగా రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి చేసి చూపించారని గుర్తు చేశారు. దత్తత తీసుకున్న కేసీఆర్, కేటీఆర్ ఈ ప్రాంత అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. కొడంగల్ ప్రాంత ప్రజలు, రైతులు సోమవారం కోస్గిలో బీఆర్‌ఎస్ తలపెట్టిన రైతు దీక్షను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ లేనిపోని ఆరోపణలతో ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, యూసుఫ్, నందారం ప్రశాంత్, నర్సిములుగౌడ్, వెంకట్రావ్, రఘువర్ధన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, కృష్ణంరాజు తదితరులున్నారు.

- స్థానిక సంస్థల తర్వాతే ఎన్నికలు?
- ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గు!
- పాలకవర్గాల్లో ముమ్మర చర్చ
- జిల్లాలో 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు
- కొత్తగా మరో 10 పీఏసీఎస్‌లు!



శివారెడ్డిపేట ప్రాథమిక సహకార సంఘ భవనం

కొనసాగింపా.. ప్రత్యేకమా..?

ఇప్పటికే పంచాయతీలు, జెడ్పీ, మండల పరిషత్ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుతోంది. కాగా, ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పాలక వర్గాల పదవీ కాలం సైతం ఈ నెల మూడో వారంలో ముగియనుంది. ఈ నేపథ్యంలో పీఏసీఎస్‌ల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందా.. లేక ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలనే ఎన్నికల వరకు కొనసాగిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. అలాగే మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం జనవరి 26న ముగియగా, 27 నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. 14 ఫిబ్రవరి 2020న సహకార సంఘాలకు ఎన్నికలు జరగ్గా, అదే నెలలో 17 నుంచి 19వ తేదీ వరకు నూతన పాలక వర్గాలను ఎన్నుకున్నారు. ఈ నెల 20వ తేదీతో ఈ పాలకవర్గాల పదవీ కాలం ముగియనుంది.

త్వరలో ముగియనున్న పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు

వికారాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మొత్తం 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ధారూరు, హరిదాస్‌పల్లి, శివారెడ్డిపేట్, వట్టిమీనపల్లి, పూడూరు, మోమిన్‌పేట్, పెద్దమర్పల్లి, మేకవనంపల్లి, బంట్వారం, ఎల్లంకన్న, యాలాల్, నవాంద్గి, తట్టేపల్లి, హస్నాబాద్, దౌల్తాబాద్, పరిగి, కులకచర్ల, మోత్కూర్, మెట్లకుంట, కొత్తగడి, ఎకమామిడిలో పీఏసీఎస్‌లు ఉండగా, పెద్దేముల్‌లో ఎఫ్ఎ్‌సీఎస్ ఉంది. జిల్లాలో ఒక ఎఫ్ఎస్‌సీఎస్, 21 పీఏసీఎ్‌ఎలకు పాలక వర్గాలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ప్రాథమిక, రైతు వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం పూర్తి కావడానికి ఆరు నెలలు ముందుగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుంది. సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించి సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఇప్పట్లో సహకార సంఘాలకు ఎన్నికలు జరిగే

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో 32కు పెరగనున్న పీఏసీఎస్‌ల సంఖ్య

కాగా, జిల్లాలో కొత్తగా ప్రాథమిక సహకార సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మరో పది పీఏసీఎస్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలో ప్రస్తుతం ఒక ఎఫ్ఎస్‌సీఎస్, 21 పీఏసీఎస్‌లు ఉన్నాయి. కోట్‌పల్లి, నాగారం, కాశీంపూర్, గోకఫసల్వాద్, రుద్రారం, చౌడాపూర్, అంగడి చిట్టంపల్లి, మంబాపూర్, లక్ష్మీనారాయణపూర్, దుద్యాల్‌లో కొత్తగా పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కొత్తగా ప్రతిపాదించిన పీఏసీఎస్‌లకు ప్రభుత్వ ఆమోద ముద్ర పడితే... జిల్లాలో పీఏసీఎస్‌ల సంఖ్య 32కు పెరగనుంది.

నేడు కోస్గికి కేటీఆర్ రాక



దుద్యాల / బొంరాస్‌పేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం కోస్గిలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్లలో ఘన స్వాగతం పలకనున్నట్లు దుద్యాల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 1:40 గంటలకు తుంకిమెట్లలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం దుద్యాల మండలంలోని హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్ల కుంట తండాల మీదుగా రానున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రారెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

వైభవం.. శివపార్వతుల కల్యాణం

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

- ముగిసిన ఆలయ వార్షికోత్సవం



శివపార్వతుల కల్యాణంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి) మండలంలోని చెంగోల్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయ 23వ వార్షికోత్సవం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో పార్వతీదేవి తరఫున వడ్ల జ్యోతి, విష్ణుమూర్తి దంపతులు, శివుడి తరఫున ఎర్రమల్లి రాజేశ్వరి, సురేశ్ దంపతులు కూర్చుని కల్యాణం నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం 5.30 గంటలకు సుప్రభాతం, రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు శివపార్వతుల కల్యాణం, 2గంటలకు మహా ప్రసాదం, 3 గంటలకు బోనాలు, పల్లకీ సేవా, భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మేఘమాల, వైస్ ప్రెసిడెంట్ గోపాల్‌రెడ్డి, కోశాధికారి బావనోళ్ల హన్మయ్య, గౌడి వెంకటేశం, శ్రీనివాస్, దేవాలయ కమిటీ సభ్యులు పులేందర్, బి.కృష్ణయ్య, బి.నర్సింహులు, ఇంద్రసేనారెడ్డి, గౌడి నర్సింహులు, సందీప్ తదితరుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



సీసీ రోడ్డు పనులు ప్రాంభిస్తున్న మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గోవిందాపూర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మారుమూల గ్రామాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ సిరాజుద్దీన్, మాజీ సర్పంచ్ పోచయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మొహ్మద్ హాజీ, సురేందర్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మత్తులో యువత చిత్తు!

విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు



మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుపడ్డ గంజాయి విక్రేతలు (ఫైల్)

- విద్యాసంస్థలు కేంద్రంగానే మాదక ద్రవ్యాల దందా
- అడ్డాగా కిరాణా దుకాణాలు, టీ, టిఫిన్ సెంటర్లు
- మేడ్చల్ ప్రాంతంలో పెద్ద మొత్తంలో పట్టుబడుతున్న డ్రగ్స్, గంజాయి
- ఆందోళనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల విక్రయాలకు మేడ్చల్ ప్రాంతం అడ్డాగా మారింది. విద్యార్థులే లక్ష్యంగా కొనసాగుతున్న డ్రగ్స్ విక్రయాలతో విద్యాసంస్థలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. విద్యాలయాలు అధికంగా ఉన్న ఏదో ఒక ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు, నార్కోటిక్ అధికారులు, ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించి మత్తు పదార్థాలు తరలిస్తున్న ముఠాలను పట్టుకోవటం పరిపాటిగా మారింది. ఈ డ్రగ్స్ రాకెట్‌ను కొనసాగిస్తున్న వారు విద్యార్థులను టార్గెట్ చేస్తూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. నగర శివారు ప్రాంతంలోని ఘట్‌కేసర్ కీసర, శామీర్‌పేట, దుండిగల్ మండలాల పరిధిలో ప్రస్తుతం వందల సంఖ్యలో విద్యాసంస్థలు ఉన్నాయి. ఆయా సంస్థల్లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులను తమ వైపునకు తిప్పుకుంటూ మత్తు ప్రపంచంలోకి లాగడానికి స్థానికంగా పెద్ద ఎత్తున నెట్‌వర్క్‌తో పలు ముఠాలు పని చేస్తున్నాయి. ఈ విషయాన్ని ఇప్పటికే పోలీసులు గుర్తించనట్టు సమాచారు. గతంలో మేడ్చల్ ప్రాంతంలోని పారిశ్రామిక వాడల్లో పని చేసే బిహార్, యూపీ, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కార్మికులకు గంజాయి విక్రయించే వారు. కానీ ప్రస్తుతం వారి పంథా మార్చుకొని మత్తును పరిచయం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లో పోలీసులు కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఖరీదైన డ్రగ్స్‌తో పాటు,

మిగతా 8వ పేజీలో...

ఫలించని అధికారుల ప్రయత్నం

విద్యార్థులకు డ్రగ్స్ పట్ల అవగాహన కల్పించడానికి పోలీసులు కళాశాలల్లో నిర్వహిస్తున్న సదస్సులు అనుకున్న మేరకు ప్రయోజనం చేకూర్చడం లేదు. డ్రగ్స్ మాఫియాల ఆగడాలను అరికట్టడానికి ఒక వైపు ఎస్‌వోటీ, ఎక్సైజ్ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నప్పటికీ డ్రగ్స్ విక్రేతలు మాత్రం దర్జాగా తమ వ్యాపారాన్ని చేసుకుంటున్నారు. విద్యాసంస్థల సమీపంలోని వేర్‌హౌజ్‌లలో గంజాయి, డ్రగ్స్ నిలువ చేయకుండా ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తునప్పటికీ ప్రయోజనం మాత్రం దక్కడం లేదు.

రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో ప్రజా పాలనలో భాగంగా నిర్వహించిన వార్డు సభల్లో వచ్చిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారం తాండూరు పట్టణంలో పలు వార్డుల్లో ఈ వెరిఫికేషన్ కొనసాగింది. దరఖాస్తుదారులు అర్హులా? కాదా? అన్న అంశాలను వార్డు ఆఫీసర్లు పరిశీలిస్తున్నారు. మూడు రోజుల పాటు ఈ పరిశీలన కొనసాగనుంది. దాదాపు 5వేల పైచిలుకు దరఖాస్తులు మున్సిపాలిటీలోని 36 వార్డులలో వచ్చాయి. ఈ దరఖాస్తులన్నింటిని వారు పరిశీలించనున్నారు.



వెరిఫికేషన్ చేస్తున్న వార్డు అధికారి

మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఇస్మాయిల్

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించాలని ముస్లిం సంఘాల ఐక్యవేదిక జాతీయ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో అన్నీ రాజకీయ పార్టీలు మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో ముస్లిం మైనారిటీల సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మైనారిటీలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ రాజకీయంగా ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ నాయకులు సయ్యద్ ఇక్బాల్, అబ్దుల్ వాహబ్, ఆసిఫ్, వసీమ్, నవాజ్, సలాం, ముస్తాఫ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా వాహబ్

తెలంగాణ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా అబ్దుల్ వాహబ్, ప్రధాన కార్యదర్శిగా ఆసిఫ్, కోశాధికారిగా మొహ్మద్ వసీమ్, కార్యదర్శిగా నవాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సలాంను ఎన్నుకున్నట్లు సయ్యద్ ఇస్మాయిల్ తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



హోమం నిర్వహిస్తున్న విద్యార్థులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): జినుగుర్తి గ్రామ శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ సాందీపని గురుకులంలో చదువుతున్న విద్యార్థులు దేశానికి ఆణిముత్యంలా తయారు కావాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం గురుకులం, పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యాధికారిణీ సదస్యులు వి.భాగయ్య ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడారు. ఇక్కడి వీరి క్రమ శిక్షణ, ఏకాగ్రత, జ్ఞానం వంటివి గుణగణాలతో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఏకలవ్య కేంద్రంలో సేంద్రియ పంటలు పండించడం, కల్తీని నివారించేందుకు చర్యలు చేపట్టడం, వాటిపై విద్యార్థులకు శిక్షణ అందించడం వంటి వాటిపై కలెక్టర్‌కు వివరించి తమ సహకారం అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. భాగయ్య మాట్లాడుతూ తాండూరు ప్రాంతంలోని చుట్టుపక్కల గ్రామాల రైతులు సేంద్రియ సాగువైపు మళ్లేందుకు కృషి చేస్తామన్నారు. నూజివీడు సీడ్స్ ఎండీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రైతులు వాతావరణానికి అనుకూలమైన పంటలను పండించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్లు మల్లారెడ్డి, వీఆర్.మూర్తి, పీసీసీ కార్యదర్శి ధారాసింగ్, రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఉత్తంచంద్, గోపాల్ బాగ్రే, జెర్ని నాగప్ప, వడ్డె శ్రీనివాస్, జెర్ని నాగప్ప, అజ్మత్ అలీ, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కురుమలు ఏకం కావాలి



బాలయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా కురుమలు ఏకతాటిపైకి రావాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణగోని సదానందం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ అన్నారు. ఆదివారం పెంటల రాయప్ప అధ్యక్షతన మహేశ్వరంలో మండల కురుమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారే తప్ప కురుమల బతుకులు బాగుపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కురుమలు సత్తా చాటాలన్నారు. కురుమలు ఏ పార్టీలో ఉన్నా రాజకీయ పదవుల కోసం ఉద్యమించాల్సిందేనన్నారు. ఈ సందర్భంగా మహేవ్వరం మండల సంఘం అధ్యక్షుడిగా మహేశ్వరానికి చెందిన పొల్కం బాలయ్యను ఏకగ్రీవంగా ఎనున్నకున్నట్లు తెలిపారు.

మండల కురుమ సంఘం కమిటీ: మండల కురుమ సంఘం ఉపాధ్యక్షులుగా గుత్తి పాండు, యాదయ్య, రఘుపతి, చంద్రయ్య, పర్వతాలు, వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, కోశాధికారి సురేష్, సహాయ కార్యదర్శులు కృష్ణ, రాజు, సలహాదారులు పెంటల రాయప్ప, కుండె వెంకటేష్, ముత్యం, మిద్దింటి బాలరాజ్, కుమార్, శ్రీను, రమేష్, చంద్రయ్య, మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, సురేష్, పాండు, గణేష్, వెంకటేష్, సాయులు ఎన్నికయ్యారు.

పాన్ మసాలా స్థావరాలపై దాడులు

● రూ.35లక్షల విలువైన ప్యాకెట్లు స్వాధీనం

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో పాన్ మసాలా స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి రూ.35లక్షల విలువైన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ ఆధ్వర్యంలో తాండూరు ధన్‌గర్‌గల్లీలో పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. పావని కిరాణ మర్చంట్స్‌లో రూ.35లక్షలు విలువైన పాన్ మసాలా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. కాగా జీఎస్టీ బిల్లులు లేకనే స్వాధీనం చేసుకున్నామని, యజమానులు బిల్లులు చూపడంతో తిరిగి పాన్ మసాలా ప్యాకెట్లను అప్పగించినట్లు తాండూరు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న పాన్ మసాలా ప్యాకెట్లు

గ్రామ దేవతలు పల్లెలకు శ్రీరామ రక్ష



విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలను నిష్ఠతో ప్రతిష్ఠించి, పూజలు చేస్తే పల్లెల్లో ప్రగతి సాధ్యం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కందివనంలో బొడ్రాయి, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠా పూజలు ఆదివారం మొదలయ్యాయి. ఉదయం హోమాలు, సాయంత్రం విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. పూజలకు నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. నియమనిష్ఠలతో గ్రామ దేవతలను కొలుస్తూ, అభివృద్ధి చెందాలన్న పట్టుదలతో ముందుకు సాగే గ్రామాలు ఎంతో ఆనందంగా, ఉన్నతంగా ఉంటాయని నవీన్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దైవ చింతనతో మెలిగే గ్రామాల్లో ఎల్లప్పుడూ శాంతి సామరస్యాలు నెలకొంటాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శివజ్యోతి, అమృనాయక్, గ్రామస్థులు కె.సూర్యప్రకాశ్, ఆంజనేయులు, నర్సింహులుగౌడ్, వెంకట్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, శివశంకర్, రాజు, కృష్ణారెడ్డి, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

దొంగతనాల నివారణకు ప్రజల్లో అవగాహన

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శనివారం తాండూరులో రెండిళ్లలో చోరీలు జరడంతో వాటి నివారణకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. చోరీల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు. తాండూరులో రెండు ఆటోలను తిప్పి 'దొంగతనాలపై పోలీసు వారి హెచ్చరిక' అని పేర్కొంటూ మైక్ అనౌన్స్‌మెంట్ చేస్తున్నారు. 'మీ వాహనాలకు తాళాలు వేసుకోవాలి. అనుమానిత వ్యక్తులుంటే డయల్ 100, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.' అని చెబుతున్నారు. బయటకు వెళ్లేప్పుడు తాళం కన్పించకుండా వేసుకోవాలని, ఇంట్లో ఒకటి, రెండు లైట్లు వేసే ఉంచాలని, ఇళ్లలో ఎవరూ లేరనే విషయం తెలువనీయొద్దని పేర్కొంటున్నారు.



పట్టణంలో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

డాక్టర్ల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి?

● కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు

ఆదిభట్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి హఠాత్తుగా చనిపోవడంతో వైద్యులు నిర్లక్ష్యం వల్లే అతడు మృతిచెందాడని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తుర్కయంజాల్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన గజ్జ సత్యగౌడ్(46) శనివారం కడుపు నొప్పి రావడంతో 'యంజాల్ హాస్పిటల్' అనే ప్రైవేట్ దవాఖానాకు వెళ్లాడు. అక్కడి డాక్టర్ చెక్‌చేసి గ్యాస్ట్రిక్ సమస్య ఉందని నిర్ధారించి అడ్మిట్ చేసుకొని వైద్యం చేశారు. శనివారం రాత్రి బాగానే ఉన్న సత్యగౌడ్ ఆదివారం ఉదయం మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు డాక్టర్లను నిలదీశారు. అతడు హార్ట్‌స్ట్రోక్‌తో చనిపోయాడని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ నాయకులు హాస్పిటల్ వద్ద ధర్నా చేశారు. డాక్టర్ల నిర్లక్ష్యం, సరైన వైద్యం చేయకే తన తండ్రి చనిపోయడని సత్యగౌడ్ కొడుకు ప్రవీణ్‌గౌడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



సత్యగౌడ్(ఫైల్)



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబీకులు, నాయకులు

కమీషన్ ఏజెంట్లదే హవా!

సిండికేట్ దందాకు కేరాఫ్‌గా పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు మారింది. లావాదేవీలన్నీ పలువురి కనుసన్నల్లో కొనసాగుతున్నాయి. వారు నిర్ణయించిందే ధర, లేదంటే ఆ ధాన్యం కొనుగోలు చేసేదిక్కుండదు. దీంతో మార్కెట్‌లో అధికారులు దమ్మీగా మారిపోవడంతో పంటలను అమ్మడానికి వచ్చిన రైతులు నిలువుదోపిడీకి గురవుతున్న పరిస్థితి.

- సిండికేట్ దందాకు కేరాఫ్‌గా పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు
- వారు చెప్పిందే రేటు... లేదంటే కొనేదిక్కుండదు
- పట్టించుకోని మార్కెట్ అధికారులు
- కాసుల కక్కుర్తితో దోపిడీకి గురవుతున్న రైతన్న
- నిబంధనలకు విరుద్ధంగా చీకట్లో తూకాలు


మార్కెట్‌లో ఉన్న వేరుశనగ బస్తాలు

పరిగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వేరుశనగ రైతులు మద్దతు ధరపై రోడ్డెక్కితే కొత్తగా బాధ్యతలు తీసుకున్న చైర్మన్ పరశురాంరెడ్డి మద్దతు ధర కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఒక్క వేరుశనగలు.. శుక్రవారానికి బదులుగా మంగళవారమే బీట్లు నిర్వహించారు. అయినా ధర పలకలేదు. చైర్మన్ చొరవ చూపినా మార్పులేదు. ఇంకా ఎక్కువ స్థాయిలో మోసం చేస్తున్నారని రైతులు వాపోయారు. మార్కెట్ యార్డులో 70కిపై లైసెన్స్‌దారులు ఉంటే, ఇందులో బాగా లావాదేవీలు నిర్వహించేది 10 మందిలోపే. 56 మంది కమీషన్ ఏజెంట్లు, 14 మంది ట్రేడర్లు ఉన్నారు. రైతులు తీసుకొచ్చిన పంటలను మార్కెట్ అధికారుల సమక్షంలో పరిశీలించి ధర నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ కమీషన్ ఏజెంట్లు నిర్ణయించిన ధరకే ధాన్యం అమ్మాల్సి వస్తోంది. లేదంటే ఎవరూ కొనుగోలు చేయరు. ఆ విధంగా ఏజెంట్ల హవా నడుస్తోంది. అధికారులు వారిచ్చే కమీషన్‌లకు అలవాటుపడి రైతులను నిలువునా మోసం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతుల ద్వారా ఆదాయాన్ని ఆర్జించే అధికారులు వారి గురించే పట్టించుకోకుండా వ్యాపారస్తులకు కొమ్ముకాస్తున్నారు. దీంతో మార్కెట్ అక్రమ వ్యాపారానికి కేంద్రంగా మారింది.

ఉదాహరణకు వేరుశనగలు క్వింటాలుకు రూ.5 వేలు నిర్ణయిస్తే అందరూ అదే ధరకు కొనాలి. ఒకవేళ ఎవరైనా సరే ఎక్కువ ధరను పాడితే వారిపై మిగతా ట్రేడర్స్ కలిసి మూకుమ్మడిగా మాటల దాడి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచే వచ్చే ట్రేడర్స్ ఎక్కువ ధరకు కొందామన్నా వీరి బెదిరింపులతో జంకుతున్నారు. ఇక వీరు ఆడిందే ఆటపాడిందే పాటగా కొనసాగుతున్నది. మార్కెట్‌కు వచ్చిన ధాన్యంకు సిండికేట్ ధర నిర్ణయించి వచ్చిన ధాన్యాన్ని ఉన్న నలుగురు ట్రేడర్లు పంచుకుంటున్నారు. ఇదంతా తెలిసినా గానీ మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

అంతా జీరో దందా

పరిగి వ్యవసాయ మార్కెట్‌లో అంతా జీరో దందా కొనసాగుతున్నది. ఇక్కడ కోట్లల్లో లావాదేవీలు జరుగుతుంటే లక్షల్లో చూపిస్తున్నారు. యేటా రూ.3.70 కోట్ల ఆదాయం పొందాలని లక్ష్యం. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.2.26 కోట్ల ఆదాయం గడిచింది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మార్చి చివరి నాటికి రూ.1.44 కోట్ల ఇన్‌కం రావాలి. ఇప్పుడు సీజన్ కాబట్టి ఒకే నెలలో సాధ్యం. మార్కెట్ నుంచి వే బిల్లులు తీయకుండానే దొంగ వేబిల్లు రశీదులతో కూడా వ్యాపారాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



నేను చైర్మన్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించా. అన్ని పరిశీలిస్తున్నా. ఏ పంట అయినా ప్రభుత్వ ధర కంటే ఎక్కువగానే కొనేలా చర్యలు తీసుకుంటా. రైతులను మోసం చేస్తే ఎంతటివారినైనా సహించం. లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

బి.పరశురాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, పరిగి

చీకట్లో తూకాలు

పరిగి మార్కెట్‌లో రైతుల ఎదుటే మోసం చేస్తున్నారు. ఈ సీజన్‌లో మాత్రం శుక్రవారం నిర్ణయించిన ధరకే శని, ఆది, సోమ, మంగళవారాల వరకు కొంటారు. ధాన్యానికి ధరను నిర్ణయించడం పక్కన పెడితే తూకాల్లో కూడా పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలకు ముందుగానే సెట్టింగ్ మార్చి పెడుతున్నారు. క్వింటాలుకు 10 కిలోల వరకు మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. చీకట్లో తూకాలు చేయొద్దనే నిబంధనలు ఉన్నా తమకేమీ పట్టవు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. లైట్లు ఆపేసి అర్ధరాత్రి 11 గంటల వరకు కూడా తూకాలు వేస్తున్నారు.

కీసరలో జైలర్ దంపతుల పూజలు


స్వామివారి చిత్రపటం అందజేస్తున్న నారాయణ

కీసర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : కీసర, చీర్యాల్ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం వరంగల్ రేంజ్ జైలర్ సంపత్‌కుమార్ దంపతులు ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఆలయ ఫౌండర్ లక్ష్మీనారాయణ సంపత్‌కుమార్ దంపతులకు స్వామివారి పట్టువస్త్రాలు, చిత్రపటాన్ని అందజేశారు.

డాక్టర్ జయప్రసాద్‌కు అవార్డు ప్రదానం


గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న జయప్రసాద్

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తాండూరుకు చెందిన జనరల్ సర్జన్ డాక్టర్ జయప్రసాద్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వైద్య విభాగంలో అత్యున్నత సేవలు అందించినందుకు గాను అవార్డు వరించింది. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి, అధికార భాషా సంఘం నాయకులు విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..


బీజేపీలో చేరిన నేతలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ ఈటల

కీసర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం ఉదయం తన నివాసంలో తిమ్మాయిపల్లికి చెందిన నాయకులకు ఈటల బీజేపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కావలి నర్సింహ్మా, కొండల్‌రెడ్డి, మేకల రామిరెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రం రెడ్డి, తిరుమల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీజేపీ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : బీజేపీ సీనియర్ నాయకుడు, ఘట్‌కేసర్ మండల మాజీ అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు సోదరుడు చలువాది గోపాల్ దశదిన కర్మలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. గోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బసవ రాజు గౌడ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మా రెడ్డి, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులకు చెక్కు అందిస్తున్న ప్రేమ్‌కుమార్ గౌడ్

కేశంపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలం కొండారెడ్డి పల్లి గ్రామ యువకులైన కె. అరుణ్ తేజ్, పి. చరణ్, ఎస్. జస్వంత్, ఎన్. నందులను అభినందించారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంగా ఈనెల 10, 11(సోమ, మంగళవారాలు)న నిర్వహిస్తున్న అండర్ - 19 ట్రై సిరీస్ చాంపియన్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆమేరకు తన కార్యాయలంలో వారిని అభినందించారు. అలాగే వారికి రూ. 10వేలు నగదు అందజేశారు. రంగారెడ్డి తరఫున ఆడుతున్నారని, మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పల్లె లింగం, కంచుకోట దశరత్, కానం ఉదయ్ కుమార్ గౌడ్, పల్లె భాస్కర్, మాధవ్, శ్రీశైలం, సురేష్, ఆసిఫ్ పాల్గొన్నారు.

ఉచితంగా గంగా జలాల పంపిణీ


జలాన్ని అందజేస్తున్న కోఆర్డినేటర్ సంగమేశ్వరచారి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళలో స్నానం చేస్తే కోటి జన్మల పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులో భాగంగా త్రివేణి సంగమంలో స్నానం ఆచరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అంతటి పవిత్రమైన ప్రదేశానికి వెళ్లలేని వారి కోసం ఆధ్యాత్మిక సేవలో పరితపించేందుకు విశ్వభారత్ మీడియా అరుదైన అవకాశాన్ని కల్పించింది. పవిత్ర త్రివేణి సంగమ నది జలాలను దేశవ్యాప్తంగా అందించేందుకు సంకల్పించిందని విశ్వభారత్ మీడియా తెలంగాణ కోఆర్డినేటర్ మోమిన్‌పేట్‌కు చెందిన కే.సంగమేశ్వరచారి తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు వేయి మంది భక్తులకు పవిత్ర గంగానది జలాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలో పలువురు భక్తులకు ఆదివారం ఆయన జలాలను పంపిణీ చేశారు.


కవి సత్యంను సన్మానిస్తున్న అతిథులు

అమృత బిందువులు పుస్తకావిష్కరణ

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు కవి వడిచర్ల సత్యం రచించిన అమృత బిందువులు పుస్తకాన్ని ఆదివారం ఆదిలీలా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్. ఆదినారాయణ, డాక్టర్ ఈటెల సమన్న.. పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, ఆదిలీలా ఫౌండేషన్, తెలుగు సాహిత్య కళ పీఠం, అనంత సాహిత్య సంస్కృతిక వేదిక, ఆధ్వర్యంలో ఢిల్లీలో కార్యక్రమం జరిగింది. 50 మంది కవులు, రెడ్ క్రాస్ సొసైటీ పాండిచరి అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీపతి, తెలుగు సాహిత్య ప్రధాన పీఠం కార్యదర్శి పట్వాల అశోక్, శతవధాని డాక్టర్ మలుగు అంజయ్య, కవి కోటం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాటంతోనే వర్గీకరణకు ఆమోదం

పరిగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణను తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిందని మాదిగ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. ఆయన్ను ఆదివారం నగరంలోని తాజ్‌దక్కన్ హోటల్‌లో కలిశారు. 11 శాతం రావాల్సి ఉండగా, తొమ్మిది శాతాన్ని ఇవ్వడాన్ని కూడా స్వాగతిస్తున్నామని పరిగి టీఎంటీఎఫ్ అధ్యక్షకార్యదర్శులు కె.వెంకటయ్య, టి.నరేందర్‌లు తెలిపారు. త్వరలో 11శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మందకృష్ణను కలిసినవారిలో సంఘం నాయకులు లాలయ్య, బిచ్చయ్య, వెంకటయ్య, నరేందర్, నర్సింహారాజు, బి.సుధాకర్, లక్ష్మీనర్సింహులు, పి.శ్రీనివాస్, వెంకటప్రసాద్, బందెయ్యలు ఉన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే వీరపల్లి శంకర్
- ఘనంగా పండుగ సాయన్న, జ్యోతీరావు పూలే విగ్రహావిష్కరణ


అభివాదం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్ రూరల్, ఫిబవరి9(ఆంధ్రజ్యోతి): మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మహల్ ఎలికట్ట గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న, మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహాల ఆవిష్కరణకు ఆదివారం ఆయన హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పండుగ సాయన్న నాడు పేద ప్రజల కోసం పాటుపడ్డారని గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం ప్రజల కోసం త్యాగం చేశారని తెలిపారు. ముదిరాజ్ బిడ్డగా ఆయన పుట్టడం అదృష్టమని తెలిపారు. గ్రామంలో మహనీయుల విగ్రహాలు పెట్టుకోవడం మంచి సంప్రదాయమని తెలిపారు. రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్రా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గత పాలకులు ముదిరాజ్‌లను గుర్తించ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వర్గీయులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముదిరాజ్‌లను విడదీయాలని చూస్తారన్నారు. అటువంటి ప్రయత్నాలకు లొంగకూడదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు నీలం మధు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని సూచించారు. బీసీల జనాభాలో ముదిరాజ్‌లు అధికంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య మాట్లాడుతూ ముదిరాజ్‌లు అందరూ కూడా ఏకం కావాలని పిలుపునిచ్చారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, స్థానిక నాయకులు శ్రీశైలం ముదిరాజ్, బుడ్డ నర్సింహ్మా, తుమ్మలపల్లి కృష్ణయ్య, మంగ వెంకటేష్, అంచె రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటే శాసనం

నందిగామ : కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా నందిగామలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో, డీజే పాటలతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేకు గజమాలతో కాంగ్రెస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

రైతులను ఆదుకుంటాం

- ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రైతులను తమ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. ఆదివారం యాచారంలో రూ.77.50 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదాంను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సొసైటీ ముందు దుకాణ సముదాయ కాంప్లెక్స్, ప్రహరీ నిర్మాణం కోసం నిధులు ఇచ్చి ఆదుకుంటామన్నారు. రైతులను సకాలంలో ఎరువులు, రుణాలు అందించి ఆదుకోవడం అభినందనీయమన్నారు. దుకాణసముదాయం నిర్మిస్తే సొసైటీకి ఆదాయం వస్తుందని చెప్పారు. గత పాలకులు ఇక్కడ ఫార్మాసిటీ తెచ్చి రైతులను రోడ్డున పడేశారన్నారు. తాము ఇచ్చిన మాట ప్రకారంగా రద్దు చేశామన్నారు. ఫార్మాసిటీ అంశంలో ప్రభుత్వంపై నిందలు వేయడం మంచిదికాదన్నారు. యాచారం మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి కల్పించడానికి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. యాచారం సొసైటీని జిల్లాలో ఆదర్శ సొసైటీగా మార్చడానికి తాను చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య చెప్పారు. ప్రహరీ కోసం రూ.25లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ టి.రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ కారింగ్ యాదయ్య, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి తదితరులున్నారు.

క్రీడాప్రాంగణాలు .. నిరుపయోగం!


బషీరాబాద్ మండలం కంసాన్‌పల్లి(ఎం)లో క్రీడా ప్రాంగణం ఇలా

బషీరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా ప్రభుత్వం ప్రతీగ్రామంలో నిర్మించిన పల్లె క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీల్లో ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో దాదాపు అన్ని గ్రామాల ప్రాంగణాలు పిచ్చిమొక్కలు, కంప చెట్ల పొదలతో నిండి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. క్రీడాల కోసం ఆట వస్తువులు పంపిణీ చేసిన కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



షాబాద్ మండలం వెంకమ్మగూడ గ్రామంలో మల్లన్న కల్యాణం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించారు. అంతకుముందు శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **షాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి)**

పాలకవర్గం ఏర్పాటు ఎప్పుడో?

- మహేశ్వరం మార్కెట్ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు కేటాయింపు
- ఆశావహుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ
- జాప్యంతో కాంగ్రెస్ నేతలకు శిరోభారంగా మారిన వ్యవహారం



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మహేశ్వరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గం పరిస్థితి. రంగారెడ్డి జిల్లాలో ఉన్న మిగతా మార్కెట్ కమిటీల పాలక వర్గాలు ఏర్పాటై ప్రమాణ స్వీకారానికి సన్నద్ధమవుతుండగా ఈ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకంలో ఇంకా జాప్యం ఎందుకు జరుగుతుందో నని తెలియక అధికార కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు. సంవత్సర కాలంగా పాలక వర్గం లేక రైతులకు అందాల్సిన పలురకాల సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదు. మార్కెట్ కమిటీ పాలక వర్గం ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని ఎదురు చూస్తున్నారు.

త్వరగా ఏర్పాటు చేయాలని మహేశ్వరం, కందుకూరు మండలాల రైతులు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌తో పాటు పలువురు అధికార పార్టీ నేతలను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా మహేశ్వరం మార్కెట్ కమిటీ రిజర్వేషన్లను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2015 - 16 లోనే ఐదు విడతలుగా ఒకేసారి లాటరీ పద్ధతిన ప్రకటించింది. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నుంచి 2015 లో విడిపోయి మహేశ్వరం మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైంది. దీనికి రెండు పర్యాయాలు జనరల్ మహిళ, మూడో విడత జనరల్, నాలుగో విడత ఎస్టీ జనరల్, ఐదో విడత జనరల్ మహిళకు రిజర్వేషన్‌లు కేటాయించారు. ప్రస్తుతం కొలువుదీరనున్న మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వేషన్ కావడంతో కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు చైర్‌పర్సన్ కోసం కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటూ పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తున్నారు. ఆ మేరకు ఎవరి ప్రయత్నాల్లో వారు చేస్తున్నారు.

రేసులో ఉన్న నేతలు

మహేశ్వరం మండలానికి చెందిన అంగోత్ కృష్ణానాయక్, నేనావత్ రాజునాయక్, పాండునాయక్, అంద్యానాయక్, రాములునాయక్‌లు ఉండగా కందుకూరు మండలం నుంచి అంజనేయులునాయక్, లచ్చానాయక్, కృష్ణానాయక్‌లు చైర్మన్ పదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. కృష్ణానాయక్, రాజునాయక్‌లు నువ్వా నేనా అనే రీతిలో కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ముమ్మర ప్రయత్నాలు చేశారు.

మూడు విడతలు కందుకూరుకేనా?

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మూడు విడతలుగా కందుకూరు మండలానికి చెందిన నేతలకే కేటాయించారు. ఈసారి మహేశ్వరం మండలానికి చెందిన నాయకులకే పదవి వరించనుందని ప్రచారం జరిగింది. ప్రస్తుతం కందుకూరు మండలానికి చెందిన నాయకునికే కేటాయిస్తారనే ప్రచారంలో ఉంది. కాగా మహేశ్వరం మండల గిరిజన కాంగ్రెస్ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కందుకూరు మండలానికి చెందిన కృష్ణానాయక్ ను చైర్మన్ గా ప్రకటిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ కొన్ని సందర్భాల్లో ప్రకటించినట్టే ప్రకటించి ఇప్పుడు ఈ ఫైల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు వద్ద ఉందనే ప్రచారం సాగుతోంది.

కానీ, పాలక వర్గం ఏర్పాటులో మాత్రం కేఎల్లార్ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా కృష్ణానాయక్ పేరు దాదాపుగా ఖరారు అయిందనే వార్తలు వినిపించాయి. అయితే ఆయన కొన్ని సందర్భాల్లో సొంత పార్టీ నాయకులపై విమర్శలు గుప్పించారని దీంతో మళ్లీ చైర్మన్ నియామకం వాయిదా పడినట్లు సమాచారం.

కొనసాగింపా.. ప్రత్యేకమా?

(5పేజీ తరువాయి)

సూచనలు కనిపించడం లేదు. గతేడాది ఫిబ్రవరి ఒకటో తేదీన పాలకవర్గాల పాలన ముగిసిన పంచాయతీలకు, ఆ తర్వాత ముగిసిన జిల్లా, మండల ప్రజా పరిషత్తులు, మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలంటే రెండు, మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతనే పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గు?

పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించేంతవరకు ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలనే కొనసాగిస్తారా? లేక పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. పీఏసీఎస్‌ల విషయమై ఇంతవరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారులపాలన ఏర్పాటయ్యే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా


కులకచర్లలో విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. కులకచర్లలో కొత్తగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. మంటపారాధన, ధ్యానదివాసం, నవగ్రహఅవసం, ఫల పుష్పాదివాసం, కళానివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వర ఆలయానికి రూ.10లక్షలు


ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డిని కలిసిన శివస్వాములు

తాండూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయానికి తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి రూ.10లక్షల నిధులు మంజూరు చేశారు. తాండూరుకు చెందిన పలువురు శివగురుస్వాములు ఆదివారం హైదరాబాద్‌లో మహేందర్‌రెడ్డిని కలిసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందుకు స్పందించిన మహేందర్‌రెడ్డి తన కోట నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆలయ ప్రహరీ పనులు ప్రారంభించుకోవాలని కోరారు. మంత్రిగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని తెలిపారు. ఈనెల 13వ తేదీన ఆలయంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణోత్సవానికి 26న జరిగే లక్ష దీపార్చన కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు.

మేడిపల్లి దర్గా ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే


మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

పూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మేడిపల్లి దర్గా ఉత్సవాల్లో పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతోపాటు పూడూరు మండల ఉపాధ్యక్షుడు రైస్‌ఖాన్, పాండు, పరిగి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, ఆంజనేయులు ముదిరాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు వారిని సన్మానించారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

పరిగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీసత్యసాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొని మహేశ్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, ప్రశాంతతకు ప్రతిరూపం బాబా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాజీ మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, నాయకులు ఆర్.ఆంజనేయులు, బి.ప్రవీణ్‌రెడ్డి, వారాల రవీంద్ర పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లకొండలో అనారోగ్యంతో పరివేద బుచ్చయ్య, పర్వేద బుచ్చ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

దోమ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని టీజీయూఎస్ దోమ మండల అధ్యక్షుడు సూర్యనాయక్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15ను సాధారణ సెలవుగా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. సెలవు ఇవ్వకపోవడంతో గిరిజన ఉపాధ్యాయ, ఉద్యోగులు జయంతి వేడుకలకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు.

పిల్లలకు వాహనమిస్తే జైలుకే!

- 18ఏళ్లు నిండని వారికి బైక్ ఇవ్వొద్దని హెచ్చరిస్తున్న పోలీసులు
- నిబంధనలు తెలియక ప్రమాదాలకు కారణమవుతున్నారని హెచ్చరిక
- వాహనమిచ్చిన వారిపై చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బషీరాబాద్ ఎస్ఐ శంకర్

బషీరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలిసీ తెలియని వయస్సు.. పిల్లలకు వాహనం చేతుల్లో ఉంటే దూసుకెళ్లే మనసత్వం.. ఇవన్నీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. 18 ఇళ్లు నిండని వారికి మన దేశంలో వాహనాలు నడపడానికి అనుమతి లేదు. తల్లిదండ్రులు లేదా బంధువుల వాహనాలను తీసుకుని నడపాలని పిల్లలు ఆత్రుత పడుతుంటారు. పెద్దలు ఎవైనా పని చెబితే బైక్ ఇవ్వాలని తల్లిదండ్రులతో పిల్లలు మారాం చేయడం, మొండి కేయడం వంటివి చేస్తుంటారు. కొన్నిసార్లు తమ పిల్లలను ఏం అనలేక ఉదారత చూపుతూ తాళం చెవి ఇచ్చేస్తారు. అయితే పిల్లలు వాహనంతో బయటకు వెళ్లి తిరిగి వచ్చే వరకు ఆందోళన చెందుతుంటారు. ఈ నేపథ్యంలో మైనర్లకు వాహనాలు ఇస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో ప్రతీఒక్కరు తెలుసుకోవాలి.

నిబంధనలు తెలియక ప్రమాదాలు

పోలీసుల తనిఖీల్లో 18 ఏళ్లు నిండని వారు కొందరు వాహనలతో పట్టుబడుతుంటారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రధాన రోడ్లు, జాతీయ రహదారి వంటి ప్రాంతాల్లో మైనార్లు చక్కర్లు కొడుతూ పోలీసులకు చిక్కుతున్నారు. మైనార్లకు నిబంధనలు తెలియక రహదారుల్లో వేగ మార్గదర్శకాలు గుర్తించక బైక్‌పై వెళ్తూ ప్రమాదాల బారిన పడటం లేదా ఎదుటి వారిని ఢీకొట్టడమో వంటివి చేస్తుంటారు. మైనర్లు వాహనాలతో రోడ్లపై వస్తూ ఎదుటి వారి గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. మైనార్లు వాహనాలతో రోడ్లపై పోలీసులకు పట్టుబడితే తాళాలు తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా తల్లిదండ్రుల్లో ఇంకా మార్పు రావడం లేదని పోలీసులు చెబుతున్నారు.

ప్రాణహాని కలిగితే జీవిత ఖైదు

లైసెన్సు కలిగిన వారు రోడ్డు ప్రమాదంలో ఎదుటి వ్యక్తి ప్రాణాలు పోవడానికి కారణమైతే బాలుడు, యజమానిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదవుతుంది. కేసుతో పాటు ఐదేళ్ల కారాగార శిక్షలు పడే అవకాశం ఉందని చట్టం చెబుతోంది.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



మైనార్లు బైక్‌లు నడుపుతూ పట్టుబడితే వాహనాన్ని సీజ్‌చేసి జరిమానా విధిస్తాం. పిల్లలను, వాహనయజమానులు (తల్లిదండ్రులు) ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మైనర్లను తల్లిదండ్రులు రోడ్లపై పంపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఈ విషయమై ఊరూరా ప్రజలకు అవగాహన కల్పించాం.

- పి.శంకర్, ఎస్ఐ బషీరాబాద్

డ్రగ్స్ మత్తులో యువత చిత్తు

(5పేజీ తరువాయి)

గంజాయి ఉండటం గమనార్హం. విద్యాసంస్థలు, విద్యార్థులు ఉండే వసతి గృహాల పరిసరాల్లో ఈ డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రాంతాల్లో చిన్న చిన్న కిరాణ దుకాణాలు, టీ, టిఫిన్, పాన్ షాప్‌లు అడ్డాగాలు మార్చుకొని మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇటీవల గుండ్లపోచంపల్లి మైసమ్మగూడ, దుండిగల్ ప్రాంతాల్లోని విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్‌ను విక్రయించడానికి యత్నించిన ఓ ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఆ ముఠా సభ్యులు సమీపంలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అద్దెకు ఇల్లు తీసుకుని మత్తు పదార్థాలు విక్రయిస్తుండటం గమనార్హం.

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యాసంస్థల వద్ద కొనసాగుతున్న డ్రగ్స్ విక్రయాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. స్థానికంగా ఉన్న విద్యాసంస్థలల్లో చదివించటానికి రాష్ట్ర నలుమూలల నుంచి చాలా మంది ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి వస్తున్నవారు మాదక ద్రవ్యాలకు అలవాటు పడే ప్రమాదం లేకపోలేదని కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ గఫర్

కోట్‌పల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని కోట్‌పల్లి ఎస్ఐ గఫర్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు కందుకూరి శివకుమార్ ఆధ్వర్యంలో నమో కేఎస్ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ గఫర్ మాట్లాడుతూ క్రీడలు ఎంతో ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. క్రీడల్లో విజయం కోసం ప్రతీఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నమో కేఎస్ఆర్ వాలీబాల్ టోర్నమెంట్‌కు టి.రాజు, సాంసన్ ఇస్మాయిల్, సురేందర్, నవాజ్ ఆర్గనైజర్లుగా వ్యవహరించారు.

ఉచిత వైద్య శిబిరం

జస్టిస్ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ అపోలో హాస్పిటల్ వారి సౌజన్యంతో కోట్ పల్లి మండల కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్ ను స్థానిక ఎస్ఐ గఫర్ ప్రారంభించారు. అనంతరం వైద్య సిబ్బంది క్యాంపులో 500 మంది కి ఉచిత వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆర్గనేజర్ శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రావిరాల రవి, రాజు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి విగ్రహ పునఃప్రతిష్ఠాపన


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వికారాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి మాత, ధ్వజస్తంభ పున ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆలయంలో దేవతాపూజ, ధాన్యాధివాసం, స్నపనం, నేత్రోన్మిలయం, చతుష్పధరబలి, శయాధివాసం, పర్యాక హోమం మంగళహారతి, మంత్ర పుష్ప కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా సోమవారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నేటి యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో 200వ వారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏదులాబాద్ రోడ్డులోగల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనగారిన వర్గాలకు ఎలాంటి అవకాశాలు లేని రోజుల్లో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఉన్నతచదువులు చదివి దేశానికి రాజ్యాంగాన్ని అందించే స్థాయికి ఎదగడం ఆ మహనీయుని గొప్పతనంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నర్రా రవికుమార్, ప్రొఫెసర్ ముత్తయ్య, సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి, మహేష్‌గౌడ్, జంగయ్య, ముత్యాలు, రాదాకృష్ణ, మల్లేష్, దాసు, ఈశ్వర్, అంజిరెడ్డి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

దుద్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 21 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో ఆదివారం ఒకే దగ్గర కలుసుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో వారికి బోధించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేశ్, అనంతరాములు, బాల్‌రాజ్, రమేశ్, గోవర్ధన్, సుజాత, గంగమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

నిరుపయోగంగా మినీ ట్యాంకు


టేకుల్‌కోడ్‌లోని మినీ వాటర్ ట్యాంకు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టేకుల్‌కోడ్‌లో ఎస్సీ కాలనీలో మినీవాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. గతంలో మిషన్ భగీరథ పైపు నుంచి కనెక్షన్ ఇచ్చి ట్యాంకులోకి నీటిని నింపడంతో కాలనీ ప్రజలకు నీటి ఇబ్బందులు తొలగిపోయాయి. అయితే రోడ్డు పనులు జరిగినప్పుడు మినీ వాటర్ ట్యాంకుకు ఉన్నా పైప్‌లైన్ ధ్వంసం కావడంతో ట్యాంకులోని నీరు రావడం లేదు. ఇప్పటికైనా మినీ వాటర్ ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అడ్‌హాక్ కమిటీ ఎన్నిక


తాండూరులో సమావేశమైన ఉద్యమకారులు

తాండూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతి స్కూల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలో గల ఉద్యమకారులు పాల్గొని అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. అడ్‌హాక్ కమిటీలో ఫేరోజ్‌ఖాన్, బంటారం భద్రేశ్వర్, కేశవులు, మోహిజ్, సంజయ్‌గౌడ్, చెన్నారం శేఖర్, ప్రకాష్ గౌడ్ సభ్యులుగా ఉండగా సలహా కమిటీ సభ్యులుగా కమల్‌అత్తర్, గోవింద్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ముజీబ్, శరణు బసప్ప, కోఆర్డినేటర్లుగా పర్యాద రామకృష్ణ, జిలాని, వాజిద్‌ను ఎన్నుకున్నారు.

టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు


సభ్యత్వం తీసుకుంటున్న సీనియర్ పాత్రికేయులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు టీయూడబ్ల్యూజే(ఐజే)లోకి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సమక్షంలో సభ్యత్వ నమోదు చేశారు. సీనియర్ పాత్రికేయులు లింగేష్, ప్రభాకర్, కృష్ణ, ఆర్. నర్సింహులు యూనియన్ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రాంచందర్, భీంసేన్‌రావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల మహాపడిపూజ


టేకులపల్లిలో మహాపడి పూజలో పాల్గొన్న శివస్వాములు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ మండలంలోని టేకులపల్లి గ్రామంలో గురుస్వామి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. 41 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో శివమాల ధరించిన స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, రమేశ్, పర్శురాములు, శ్రీనివాస్, శ్రీకాంత్, సురేందర్, శివస్వాములు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


లక్ష్మి మృతదేహం

దౌల్తాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వెంకటప్పకు 15 సంవత్సరాల కిందట కర్ణాటక రాష్ట్రం సేడం తాలూకా రెబ్బన్‌పల్లికి చెందిన లక్ష్మి(32)తో వివాహం జరిగింది. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరుగుతుండేవి. శనివారం మధ్యాహ్నం భార్య లక్ష్మి తనకు మంగళసూత్రంలో వేసుకునే బంగారు గుండ్లు నారాయణపేట వెళ్లి తీసుకొద్దామని భర్తను కోరింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. దీంతో మనస్తాపానికి గురైన భార్య లక్ష్మి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వెళ్లిన భర్త చూసేసరికి అప్పటికే మృతిచెందింది. మృతురాలి తండ్రి చంద్రప్ప పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిట్స్‌తో వ్యవసాయ కూలీ మృతి


ఫిట్స్‌తో మృతి చెందిన గణేష్

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్‌తో ఓ వ్యవసాయ కూలీ మృతిచెందాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన గణేష్(32) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనినిమిత్తం కేశవరం గ్రామానికి చెందిన రాములు పొలంలో పనిచేయడానికి వెళ్లాడు. పని చేస్తుండగా ఫిట్స్ వచ్చి అకస్మాత్తుగా పడటంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడవి జంతువు దాడిలో లేగదూడ మృత్యువాత

దోమ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని దొంగ ఎన్కెపల్లి గ్రామానికి చెందిన పిల్లి సాయిబాబా పొలం దగ్గర పశువుల పాకలో కట్టేసిన లేగ దూడపై శనివారం రాత్రి గుర్తు తెలియని అటవీ జంతువు దాడి చేయడంతో మృతి చెందింది. ఆదివారం ఉదయం రైతు సాయిబాబా పశువుల పాకకు వెళ్లి చూడగా లేగ దూడ మృతి చెందింది. ఈ విషయంపై ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా గుర్తు తెలియని అటవీ జంతువు లేగదూడపై దాడి చేసి ఉంటుందని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంకిమెట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త, తెలంగాణ ఉద్యమకారుడు మోహన్‌చారి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న దోమ మండల నాయకులు

దోమ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను ఆదివారం దోమ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆర్.బందెయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి

యాలాల, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డిలు అన్నారు. అగ్గనూరు గ్రామంలో ఆదివారం రూ.10లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా చైర్మన్ శ్రీధర్, మాజీ సర్పంచ్ భీమప్ప, వెంకటయ్య, గరివప్ప, వీరేశం, నరేందర్, హన్మంతు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ టీచర్ మృతి

కొడంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్, సంఘ సంస్కర్త మొగులప్ప ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల అంబేడ్కర్ సంఘం, వివిధ ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. పర్సాపూర్‌లో నిర్వహించిన అంత్యక్రియల్లో వారు పాల్గొని సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, కేఎన్‌పీఎస్ నాయకులు ఎరన్‌పల్లి వెంకటయ్య పాల్గొన్నారు.